ప్రజాశక్తి

సోమవారం 21 అక్టోబర్ 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

విద్యుత్ బాదుడుకు కసరత్తు

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 16 లక్షల మందిపై భారం
- స్మార్ట్ మీటర్ల బిగించేందుకు ముమ్మర ఏర్పాట్లు



ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

వైసిపి ప్రభుత్వ హయాంలో ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని గగ్గోలు పెట్టి బాదుడే..బాదుడు అని ప్రత్యేక కార్యక్రమం చేపట్టిన టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలలకే విద్యుత్ ఛార్జీల పెంపునకు కసరత్తు చేస్తోంది. విద్యుత్ పంపిణీ సంస్థలకు రూ.8114 కోట్ల మేరకు నష్టాలు వస్తున్నాయని, వీటిని వినియోగదారుల నుంచి వివిధ రూపాల్లో వసూలు చేయాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

గత ప్రభుత్వం కూడా 2015 నుంచి 2019 వరకు వచ్చిన నష్టాలను ప్రజలపై ట్రూ అప్ ఛార్జీల ▶ 2లో

నర్సుపై ప్రేమికుడు దాడి

- బ్రెయిన్ డెడ్ స్థితిలో బాధితురాలు
- ఆస్పత్రిలో చేర్పించి నిందితుడు పరారీ

వార్త మెయిన్ పేజీలో



అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - చేబ్రోలు : మండలంలోని పాత రెడ్డిపాలెం జోసఫ్ నగర్‌లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ, ఎమ్మెల్యే డి,నరేంద్ర కుమార్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణమాదిగ మాట్లాడుతూ రాజ్యాంగంలో అంబేద్కర్ పొందుపర్చిన హక్కులు, రిజర్వేషన్లను దళితులు అంటరానితనం నుంచి బయట పడడానికి పూర్తిస్థాయిలో అందుకో లేకపోయినా సామాజిక మనుగడకు దోహదపడ్డాయని చెప్పారు. బాబూ జగ్జీవన్‌రామ్ చొరవతోనే కార్మిక చట్టాలు వచ్చాయన్నారు. ఆలాంటి మహనీయు విగ్రహాలు పెట్టుకుని గౌరవించుకోవడం మంచిదని, అయితే వారి ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు ఆర్.సురేష్ మాదిగ, కె.సత్యం మాదిగ, ఎం.హృదయరాజు మాదిగ, టిడిపి నాయకులు కె.రవిశేఖర్, రామరాజు, జనసేన నాయకులు చందు శ్రీరాములు పాల్గొన్నారు.

కాపు సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా: నరసరావుపేట పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో నియోజకవర్గ శ్రీకృష్ణదేవరాయలు కాపు సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజరయ్యారు. అనన్య హాస్పిటల్ అధినేత, సింగరాజు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సింగరాజు సాయికృష్ణ మాట్లాడుతూ కాపుల్లో వెనుకబడిన వారికి ఆర్థికంగా సహాయ సహకారాలు అందించాలన్నారు.

విద్యుత్ బాదుడుకు కసరత్తు

(మొదటి పేజీ తరువాయి)

పేరుతో ఎడాపెడా వసూలు చేసింది. ఆ తర్వాత 2020-21, 2021-22 ఇలా ప్రతిఏటా సర్దుబాటు ట్రూ అప్ ఛార్జీలను కూడా వసూలు చేశారు. జిల్లాలో ఉన్న 18 లక్షల మంది వినియోగదారుల నుంచి ఈ వసూలు కొనసాగింది. గతంలో వినియోగించుకున్న విద్యుత్‌కు ఐదేళ్ల తర్వాత మళ్లీ అదనపు ఛార్జీలు వసూలు చేయడంపై గత ప్రభుత్వం మీద ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. 2022-23లో వచ్చిన నష్టాలను ప్రజలపై భారం మోపేందుకు ఆన్‌లైన్‌లో ప్రజాభిప్రాయసేకరణ చేయనున్నారు. 2023-24కి మరో రూ.11 వేల కోట్లు వసూలుకు రంగం సిద్ధమవుతోంది. ఈ విధంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో 16 లక్షల మంది వినియోగదారులపై భారం పడనుంది. ఒక్కో వినియోగదారునిపై సగటున రూ.300 నుంచి రూ.వెయ్యి వరకు అదనపు ఛార్జీల పెరుగుదల ఉండనుంది. విద్యుత్ ఛార్జీల పెంపుపై ఆన్‌లైన్‌లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు. ఇప్పటికే అధికంగా బిల్లులు చెల్లిస్తున్న వారు మరోసారి భారం మోయడం ఎలా అని విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపును వ్యతిరేకిస్తూ ఇప్పటికే సిపిఎం ఆధ్వర్యంలో ఇటీవల జిల్లాల్లో విద్యుత్ కార్యాలయాలు, సబ్ స్టేషన్ల ఎదుట ధర్నాలు, నిరసనలు తెలిపారు. విద్యుత్ ఛార్జీల పెంపుపై నిర్వహించే ఆన్‌లైన్ ప్రజాభిప్రాయసేకరణలో కూడా నిరసన తెలిపాలని సిపిఎం నిర్ణయించింది. ఇప్పటికే నిత్యావసర వస్తువలు ధరలు పెరిగిన నేపథ్యంలో మరోసారి విద్యుత్ ఛార్జీల పెంపుతో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భారంపై భారం కానుంది. తాము అధికారంలోకి వస్తే ఛార్జీలను పెంచబోమని, తాము చార్జీలన తగ్గిస్తామని ఎన్నికల్లో విస్తృత ప్రచారం చేసుకున్న టిడిపి కూటమి నాయకులు ఇప్పటి వరకు పేద, మధ్య తరగతి ప్రజలపై వివిధ రూపాల్లో భారం మోపనున్నారు. విద్యుత్ చార్జీలను ఒక వైపు పెంచుతూనే మరోవైపు స్మార్టు మీటర్ల ఏర్పాటుకు అధికారులు ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. ఇప్పటికే మీటర్లమార్పిడికి ప్రాథమిక కసరత్తు పూర్తయింది. జిల్లాలో తొలుత అత్యధిక వినియోగం చేసే వారికి స్మార్టు మీటర్లు అమరుస్తారని తరువాత దశలవారీగా జిల్లాలోని 16 లక్షల మంది వినియోగదారుల్లో తొలి విడత ఐదు లక్షల కనెక్షన్ దారులకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు.

రాజకీయ కారణాలతో పొట్టకొట్టొద్దు

కొనసాగుతున్న చిరుద్యోగులు, కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాజకీయ కారణాలతో చిరుద్యోగులు, కార్మికుల పొట్టకొట్టడం దారుణమని పల్నాడు బాలోత్సవాల కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తొలగించిన నరసరావుపేటలో మున్సిపల్ ఇంజినీరింగ్ ఉద్యోగులు, కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బాధితులు 18 రోజులుగా చేస్తున్న ఆందోళనకు ఆయన ఆదివారం మద్దతు తెలిపారు. ఇందులో భాగంగా మున్సిపల్ కార్యాలయం ఎదుట 6వ రోజు రిలేదీక్షలను ప్రారంభించి మాట్లాడారు. అధికార పార్టీకి అధికారులు కొమ్ముకాయడం, అన్యాయంపై కార్మికులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోపోవడం సరికాదన్నారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ సిలార్‌మసూద్, ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షులు షేక్ చిన్న అల్లాబక్షు మాట్లాడుతూ తమను విధుల్లోకి తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరుతున్నా కాలయాపన చేస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. విధుల్లోకి తీసుకోవడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని, అప్పటివరకూ పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. దీక్షల్లో బి.నాగమల్లేశ్వరి, ఎస్.రమాదేవి, మహబూబ్ సుభాని, మహబూబ్ బాషా, సైదా, పి.రమణ, ఎ.పద్మ పాల్గొన్నారు.



దీక్షలను ప్రారంభించి మాట్లాడుతున్న పల్నాడు బాలోత్సవం కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు

సిఎం మాటలూ పట్టని మేతగాళ్లు

షాడోల అవతారంలో రంగంలోకి అక్రమార్కులు - యథేచ్ఛగా ఇసుక తరలింపు

ప్రజాశక్తి-తాడేపల్లి



ఇసుక విధానంలో సిఎం ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అవన్నీ అపహాస్యం పాలవుతున్నాయి. టిడిపి నాయకులే ఇసుక మేతగాళ్ళుగా అవతారమెత్తుతున్నారు. మంగళగిరి నియోజకవర్గ నుండి మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే. గత ప్రభుత్వంలో మాదిరిగానే ఈ ప్రభుత్వంలో కూడా కొంతమంది షాడోలుగా రంగంలోకి దిగడంతో అధికారులు ాూసి చూడనట్లు వదిలేస్తున్నారు. ఇసుక అక్రమాలు జరిగితే అధికారులను కూడా బాధ్యత వహించేలా చేస్తామని సిఎం ప్రకటించినా పరిస్థితుల్లో మార్పు రావడం లేదు. తాడేపల్లి, ఎర్రబాలెం, గ్రామాలకు చెందిన ఇసుక అక్రమార్కులు మధ్య ఇటీవల ఇసుక క్వారీలో గొడవ జరిగింది. నా వాహనాలు ముందు లోడ్ చేయాలంటే, నా వాహనాలు ముందు లోడ్ చేయాలని ఇద్దరూ కొడవకు దిగి కొట్టుకున్నారు కూడా. దీంతో ఒక గ్రూపు పోలీసులకు ఫజర్యాదు చేసింది. అయితే షాడోలుగా వ్యవహరిస్తున్న వారు ఈ కేసును నీరుగార్చడానికి యత్నిస్తున్నారు. మంత్రి లోకేష్ కలుగజేసుకుని అయినా ఇసుక అక్రమాలను నియంత్రించాలని, సామాన్యులకు దక్కేలా చూడాలని ప్రజలు, భవన నిర్మాణ కార్మికులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులకు ఎంపీ, ఎమ్మెల్యేల శంకుస్థాపన



ప్రజాశక్తి - నాదెండ్ల : పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాల్లో చివరి రోజు కార్యక్రమాల్లో భాగంగా యడ్లపాడు, నాదెండ్ల మండలాల్లో అభివృద్ధి పనులకు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకష్ణదేవరాయలు, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం శంకుస్థాపన చేశారు. లింగారావుపాలెంలో రూ.20 లక్షలతో సీసీ రహదారులు, డ్రెయిన్ల నిర్మాణ పనులను, సంకురాత్రిపాడు, గిరిజవోలులో రూ.23 లక్షలతో సీసీ రహదారులు, డ్రెయినేజీల పనుల శిలాఫలకాలు ఆవిష్కరించారు.

ప్రజాశక్తి - కారంపూడి :దేశానికి పట్టుగొమ్మలైన గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశమూ అభివృద్ధి చెందుతుందని, రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వేపకంపల్లి, పెద్దకొదమగుండ్ల, గాదెవారిపల్లెలో సిసి రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. కారంపూడిలోని మండల పరిషత్ కార్యాలయంలో సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు.

గంజాయి ముఠా అరెస్టు

ఏడు కిలోల సరుకు స్వాధీనం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



వివరాలు చెబుతున్న డీఎస్పీ

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ముఠాను ఒన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వివరాలను డీఎస్పీ కె.నాగేశ్వరరావు ఆదివారం వెల్లడించారు. పల్నాడు రోడ్డులో శ్మశానవాటిక సమీపంలో 8 మంది గంజాయి అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో తనిఖీలు చేపట్టారు. ఐదుగుర్ని అదుపులోకి తీసుకోగా ముగ్గురు యువకులు పరారయ్యారు. పట్టుబడిన వారి వద్దనుండి 7 కిలోల గంజాయి, 8 ద్విచక్ర వాహనాలు, కారును స్వాధీనం చేసుకున్నారు. విశాఖపట్నం నుండి గంజాయి తెచ్చి నరసరావుపేటలో విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని డీఎస్పీ చెప్పారు. ఇదిలా ఉండగా బంగారం దుకాణం నుండి ఇంటికి బయలుదేరిన మహిళను దారిలో అడ్డగించి దోపిడికి పాల్పడిన కేసులో ముగ్గుర్ని అరెస్టు చేయడంతోపాటు ఆభరణాలు స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశామని డీఎస్పీ తెలిపారు. గంజాయి రహిత నరసరావుపేటగా తీర్చిద్దేందుకు పోలీసుల కృషికి ప్రజల సహకారం అవసరమని, గంజాయి క్రయ విక్రయాల గురించి తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. గంజాయి విక్రేతలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఒనటౌన్ సిఐ చరణ్, ఎస్ఐ పి.వంశీకృష్ణ, కానిస్టేబుల్ వీరాజనేయులును డీఎస్పీ అభినందించారు.

బీమాను దెబ్బతీసే చర్యలు



ప్రజాశక్తి-చిలకలూరిపేట

సాధారణ, మధ్యతరగతి ప్రజలకు జీవిత బీమా సంస్థ (లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా - ఎల్ఐసి) తన బీమా పాలసీలతో ధీమాని ఇస్తోంది. దేశ ప్రజలకు దశాబ్దాలుగా తనసేవలను అందిస్తున్న ఎల్ఐసితో ఎంతోమంది బంధం పెనవేసుకుని ఉంది. ఎల్ఐసిలో పాలసీ తీసుకున్న వారు సాధారణంగా మరణిస్తే పాలసీ మొత్తం ఇవ్వటమే కాక ఆ పాలసీకి ఎంత మొత్తం బోనస్ వస్తే అంత మొత్తం చెల్లిస్తారు. ఒకవేళ పాలసీదారులు ప్రమాదంలో మరణిస్తే రెట్టింపు బీమాతో పాటు అప్పటి వరకు వచ్చే బోనస్ కలిపి ఇస్తారు. పాలసీ ప్రీమియం చెల్లించడం పూర్తయితే ప్లాన్‌కు అనుగుణంగా రాబడి ఉంటుంది. ఎంతో మంది పాలసీదారులకు నమ్మకమైన సంస్థగా ఉన్న ఎల్ఐసిని నమ్ముకుని లక్షలాది మంది ఏజెంట్లు, వారి కుటుంబాలు జీవిస్తున్నాయి.

అయితే ఈ సంస్థతోపాటు ఏజెంట్ల వ్యవస్థనూ నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకుంది. పాలసీ ప్రీమియం విలువ పెంచడం, జీఎస్టీ ఇందుకు కొన్ని తార్కాణాలు. సాధారణ, మధ్య తరగతి ప్రజలకు ఎక్కువ ఉపయోగంగా ఉండే ఎండోమెంట్ పాలసీ 9-14, జీవన్ లక్ష్య 9-33 వంటి వాటికి ప్రీమియం తక్కువ. పాలసీ దారు మరణిస్తే వస్తే బీమా మొత్తం ఎక్కువ. అయితే దీన్ని ఈనెల నుండి రద్దు చేశారు. ప్రీమియంకు ఆదాయ పన్ను నుంచి గతంలో ఉన్న మినహాయంపును ఎత్తేశారు. పాలసీ తీసుకునే వారి వయస్సు 55 ఏళ్ల నుండి 50 ఏళ్లకు కుదించారు. ఈ చర్యల వల్ల చాలామంది బీమాకు దూరమవుతారని ఏజెంట్లు, ఉద్యోగులు, చెబుతున్నారు.

మరోవైపు బీమా ప్రీమియంపై జీఎస్టీ కూడా పాలసీదారులు, ఏజెంట్లకు ప్రతికూలంగా మారింది. దీనివల్ల ఎల్ఐసి లక్షల పాలసీలను తద్వారా ప్రీమియంను నష్టపోతోంది. తక్కువ వడ్డీకి గృహ రుణాలు, బీమా పాలసీలపై రుణ సదుపాయం వంటివి కల్పిస్తున్న ఎల్ఐసిని మరింత బలోపేతం చేయాలేగాని, ఆర్థిక సంకెళ్లు దగదనే వాదన సర్వత్రా వ్యక్తమవుతోంది. చిన్నమొత్తంలో పాలసీల వల్ల గ్రామీణ ప్రాంతాల్లోనే సామాన్యులతోపాటు పట్టణ ప్రాంతాల్లోని పేదల వాడల్లో, ఆర్థికంగా, సామాజికంగా వెనకబడిన వర్గాల్లోనూ బీమా పాలసీలకు అవకాశం ఏర్పడింది. అందుకే 25కుపైగా ప్రైవేటు బీమా కంపెనీలున్నా ఎల్ఐసి మాత్రం తన పట్టును నిలబెట్టుకుంటోంది.

చిలకలూరిపేట కేంద్రంగా 484 మంది ఎల్ఐసి ఏజెంట్లు ఉన్నారు. గతేడాది 6344 పాలసీలకుగాను రూ.19 కోట్లను ఎల్ఐసి సంపాదించింది. ఏళ్ల తరబడి ఏజెంట్లు ఎల్ఐసినే జీవన వృత్తిగా పని చేస్తూ సంస్థ అభివృద్ధితోపాటు వారూ జీవనం పొందుతున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం డిజిటలైజేషన్ పేరుతో ఏజెంట్లకు నష్టం చేసే చర్యలు తీసుకోవడం సరికాదని, సంస్థలో ఏజెంట్లు ఎంతో కీలకమని ఎల్ఐసి ఏజెంట్ల అసోసియేషన్ (సిఐటియు) మచిలీపట్నం డివిజన్ జాయింట్ సెక్రెటరీ గ్రంధి వీరయ్య పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, జీవన ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో ఏజెంట్లకు ఇచ్చే కమీషన్‌ను పెంచాల్సిన దశలో దాన్ని మరింతగా తగ్గించడాన్ని ఆయన విమర్శించారు. గతంలో ఉన్న ప్రీమియాన్ని 8 శాతం పెంచడం సరికాదని, ప్రభుత్వ చర్యలతో దేశవ్యాప్తంగా 18 లక్షల ఏజెంట్ల మనుగడ ప్రశ్నార్థకం అవుతోందని ఏజెంట్ల యూనియన్ చిలకలూరిపేట పట్టణ ట్రెజరర్ నల్లపనేని సాంబశివరావు అన్నారు.

ప్రజాశక్తి
గుంటూరు, పల్నాడు
3
సోమవారం 21 అక్టోబర్ 2024

మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యం

ఎఎన్‌యు విసి ప్రొఫెసర్ కె.గంగాధర్

సైకాలజీ డిపార్టెమెంట్, ఎపిఎ ఇండియా ఆధ్వర్యంలో సదస్సు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

పని ప్రదేశంలో మానసిక ఆరోగ్యానికి శారీరక, మానసిక ఆధ్యాత్మిక అంశాలు ఎంతో కీలకమని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కే.గంగాధర రావు తెలిపారు. డిపార్ట్మెంట్ ఆఫ్ సైకాలజీ, ఏపీఏ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పని ప్రదేశంలో ఆరోగ్యంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ పని ప్రదేశంలో వచ్చే మార్పులకు మానసికంగా సంసిద్ధమైతే ఒత్తిడికి లోనవ్వాల్సిన అవసరం ఉండదని తెలిపారు. సమతుల్య ఆహారం తీసుకుంటే మానసిక ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. ప్రస్తుత సమాజంలో మద్యపానం, ధూమపానం ప్రజల మానసిక ఆరోగ్యాన్ని పాడు చేస్తున్నాయని తెలిపారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వీరయ్య మాట్లాడుతూ మానసిక, శారీరక ఆరోగ్యాలకు అవినాభావ సంబంధం ఉందని, ఏది బాగో లేకపోయినా మనిషి పై ప్రభావం చూపిస్తుందని తెలిపారు. డిపార్ట్మెంట్ ఆఫ్ సైకాలజీ హెచ్ఒడి ప్రొఫెసర్ జి. చెన్నారెడ్డి మాట్లాడుతూ యూనివర్సిటీలో 2021 నుంచి సైకాలజీ డిపార్ట్మెంట్ ప్రారంభించామని, మూడేళ్ల కాలంలోనే ఒక ఇంటర్నేషనల్ సెమినార్, మూడు నేషనల్ సెమినార్స్ నిర్వహించామని తెలిపారు. సైకాలజీ డిపార్ట్మెంట్ అభివృద్ధికి యూనివర్సిటీ యాజమాన్యం ఎంతో సహకరిస్తుందని తెలిపారు. సైకియాట్రిస్ట్ డాక్టర్ నీలి ఉమా జ్యోతి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో పిల్లల పై సాంకేతిక అంశాలు విపరీత ప్రభావం చూపిస్తున్నాయని, తల్లిదండ్రులు, విద్యావేత్తలు ఈ విషయంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పరస్పర సంబంధాలపై సాంకేతిక పరిజ్ఞానం



వ్యతిరేక ప్రభావం చూపిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం అతిథులను సైకాలజీ అధ్యాపకులు, ఏపీఏ ఇండియా సభ్యులు సన్మానించారు. విజయవాడకు చెందిన సైకియాట్రిస్ట్ డాక్టర్ అయోధ్య ఆర్యే, సైకాలజీ డిపార్ట్మెంట్‌కి చెందిన ప్రొఫెసర్ టీడీ విమల, హైదరాబాద్ కు చెందిన క్లినికల్ సైకాలజిస్ట్ గంగాధర్ బారెడ్డి, డాక్టర్ అర్చన నండూరి పని ప్రదేశంలో మానసిక ఆరోగ్యానికి సంబంధించిన అనేక అంశాలను వివరించారు. కార్యక్రమంలో డిపార్ట్మెంట్ సైకాలజీ అధ్యాపకులు ఎస్ .అనుపమ, బి. ప్రమీల రాణి, కే. కృష్ణమోహన్, కె.శాంతి, ఏపీఏ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్. రాజేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు కృష్ణ భరత్, జాతీయ కార్యదర్శి రవిభార్గవ్, రాష్ట్ర అధ్యక్షుడు జానకిరామ్, డాక్టర్ పులి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పి వి వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యపు ఆహార అలవాట్లతో ఇన్‌ఫెక్షన్లు

ప్రజాశక్తి-గుంటూరు : మన అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, నీరు, మన చుట్టూ ఉన్న వాతావరణమే ఇన్‌ఫెక్షన్లకు కారణం అని జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నీరెన్ రావెల అన్నారు. ఆది వారం అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాల యంలో నిర్వహించిన ఆరోగ్య సభలో డాక్టర్ నీరెన్ మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన ఆహారం, సరైన సమయంలో తీసుకుంటూ, వారానికి ఐదు రోజులు ప్రతి రోజూ 45 నిముషాల చొప్పున వాకింగ్ గానీ, ఇష్టమైన వ్యాయామం చేస్తే వ్యాధి నిరోధక శక్తి వివిధ రకాల ఇన ఫెక్షన్లు రాకుండా ఉంటాయన్నారు. ప్రస్తుతం మలేరియా, టైఫాయిడ్ ముఖ్యంగా డెంగీ, చికెన్‌గున్యా లాంటి జ్వరాలు చూస్తున్నామని, మలేరియా సాధారణంగా రాత్రి పూట కుట్టే దోమల వల్ల వస్తుందన్నారు. డెంగీ, చికెన్ గున్యా లాంటి వైరస్ వల్ల వచ్చే జబ్బులు ఉదయంపూట దోమలు కుట్టటం వల్ల వస్తాయన్నారు. కావున నివసించే ప్రాంతంలో బురద, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. చికెన్ గున్యా వచ్చినవాళ్లు కదలటానికి కూడా ఇబ్బంది పడతారని, ఈ సందర్భాలలో తక్కువ మోతాదులో నొప్పుల బిళ్ళలు వాడుకోవచ్చన్నారు. డెంగీ వచ్చినప్పుడు కొన్ని సందర్భాలలో ప్లేట్లెట్లు తగ్గుతాయని, అందుకు ఆందోళన పడాల్సిన అవ సరం లేదని, ప్లేట్లెట్స్ పెరిగే మందులు, ఇంజక్షన్లు ఇవ్వవచ్చునన్నారు. మలేరియా ప్రస్తుతం చాలా తక్కువగా కనిపిస్తుందని, ఈ జ్వరం వచ్చినప్పుడు చలితో కూడిన జ్వరం వస్తుంది అని తెలిపారు. టైఫాయిడ్ గురించి వివరిస్తూ ఇది భారతదేశంలో ఎక్కువగా కనిపిస్తుందని, ఈజ్వరం మనం తినే ఆహారంలో శుచి శుభ్రత లేకపోవడం వల్ల వస్తుందని తెలిపారు. ఈజ్వరం తేలికగా వేరొకరికి వ్యాప్తి చెందుతుందని, పొట్ట నొప్పి, విరేచనాలు వంటి



మాట్లాడుతున్న డాక్టర్ నీరెన్ రావెల

లక్షణాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా అవగాహన సభ్యులు అడిగిని సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం డాక్టర్ నీరెన్ రావెలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, రైతుసంఘం నాయకులు బండారు శ్రీనివాసరావు, జెవివి నాయకులు చలమారెడ్డి, అవగాహన సభ్యులు విద్యాధరకుమార్ పాల్గొన్నారు.

నీరుకొండలో మూడు రోజులు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి మండల పరిధిలోని నీరుకొండ గ్రామ పరిధిలో 132 కెవి లైన్ పాత కండక్టర్ మార్చి నూతన కండక్టర్ వేయుట కొరకు నీరుకొండ గ్రామ పరిధిలో ఈనె ల 21వ తేదీ నుండి 23వ తేదీ వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏడీఈ జి సురేష్ బాబు ఆదివారం తెలిపారు. సోమవారము నుండి బుధ వారము వరకు ఉదయం 07:00 గంటల నుండి సాయంత్రం 05:00గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. నీరుకొండ గ్రామ విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

అమరావతిలో శరవేగంగా ఫోరెన్సిక్ ప్రయోగశాల పనులు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో ఫోరెన్సిక్ ప్రయోగశాల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. సుమారు రూ .350 కోట్ల వ్యయంతో 10 ఎకరాలలో జి ప్లస్ 5 అంతస్తుల ప్రయోగశాల నిర్మాణానికి 2017 డిసెంబర్ 28న ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర స్థాయిలో జరిగే నేరాలకే కాకుండా దేశం లో ఎలాంటి నేరాల గురించైనా సమర్ధవంత మైన సాంకేతికతతో నేర నిర్ధా రణ జరిగేలా ప్రయోగశాల నిర్మాణం ప్రారంభించారు. 2014 - 19లో నిర్మాణ పనులు కొంతమేర జరగ్గా 2019లో వైసిపి అధికారంలోకి వచ్చాక పనులు మందగించాయి. కూటమి ప్రభుత్వం



తుళ్లూరులో ఫోరెన్సిక్ ల్యాబ్

అధికారంలోకి రావడంతో ప్రయోగశాల నిర్మాణ పనులు మళ్ళీ పుంజుకున్నాయి. రెండు,మూడు నెలల్లో ప్రయోగశాలలో కార్యకలాపాలు మొదలయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. అంతర్జాతీయ స్థాయి ప్రయోగశాల నిర్మాణంతో పాటు డిఎన్ఎ, సైబర్, నార్కోటిక్ బయో మెట్రిక్, బాలిస్టిక్, ఫోరెన్సిక్ అకౌంటింగ్‌కు సంబంధించిన ఆరు ఎక్స్ లెన్స్ కేంద్రాలు, శిక్షణ, పరిశోధన, అభివృద్ధి విభాగాల ఏర్పాట్లు జరుగుతున్నాయి.

'వ్యవసాయ రంగ సమస్యలు - కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు'అంశంపై

విజయవాడ ఎంబివికెలో రేపు సదస్సు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

వ్యవసాయ రంగాన్ని చిన్నాభిన్నం చేస్తూ, రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై అక్టోబర్ 22వ తేదీన విజయవాడ ఎం బివికే లో జరుగు వ్యవసాయ రంగ సమస్యలు - కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు అంశంపైన జాతీయ సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు కోరారు. ఆదివారం ఉదయం ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి లో రైతు సంఘం నాయకులు కరపత్రాలు పంపిణీ చేస్తూ, విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జొన్న శివశంకరరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం మూడవసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా వ్యతిరేక విధానాలను మరింతగా అవలంబిస్తూ వ్యవసాయ రంగాన్ని చిన్నాభిన్నం చేస్తుందని అన్నారు. ఒకవైపున వ్యవసాయ రంగం దివాలా తీసి, ప్రకృతి వైపరీత్యాలు సంభవించి రైతాంగం పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితులలో పంటల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని అన్నారు. రైతులు, కౌలు రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర కల్పించకుండా, పంటల బీమా పాలసీ తీసుకురాకుండా,



కుంచనపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న జొన్న శివశంకరరావు తదితరులు

కార్పొరేట్ వ్యవసాయాని ప్రోత్సహించేందుకు మోడీ ప్రభుత్వం పూనుకుందని అన్నారు. అంతే కాకుండా రాష్ట్రంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకుండా , పంట నష్టపోయిన రైతులను ఆదుకోకుండా అన్నదాత సుఖీభవ పథకం కింద నగదు జమ చేస్తామని చెప్పడం ఏమిటని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. రైతులు, కౌలు రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పైన మంగళవారం విజయవాడలో జరిగే వ్యవసాయ రంగ సమస్యలపై జాతీయ సదస్సుకు రైతులు కౌలు రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, అమ్మిశెట్టి రంగారావు, అమ్మిశెట్టి శివ, బాబు, భూపతి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

కాల్వలో గల్లంతైన విద్యార్థి మృతి

ప్రజాశక్తి - తెనాలి

సరదాగా ఈతకు దిగి కాలువలో గల్లంతైన ఇంజినీరింగ్ విద్యార్థి మృతదేహం లభ్యమైంది. రూరల్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం గుంటూరుకు చెందిన రవీంద్ర(20) లాం లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ఐదుగురు మిత్రులతో కలిసి శనివారం సంగం జాగర్లమూడి సంగమేశ్వర స్వామి ఆలయానికి వచ్చి, దర్శనం అనంతరం వారు అదే ప్రాంతంలోని కొమ్మమూరు కెనాల్‌లో ఈతకు దిగారు. నీటి ఉధృతికి రవీంద్ర నీళ్ళలో కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. ఎన్ డి ఆర్ ఫ్, ఫైర్ బృందాలు శనివారం సాయంత్రం నుంచి గాలింపు చేపట్టగా ఆదివారం కొమ్మమూరు కెనాల్ కాకుమాను వద్ద విద్యార్థి మృతదేహం లభ్యమైందని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని జానపాడు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జానపాడు గ్రామానికి చెందిన యానాల సుబ్బారావు(44) మద్యానికి బానిసై ఈనెల 12వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడని, కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదని తెలిపారు. గతంలో కూడా ఇదే విధంగా ఇంటి నుంచి వెళ్లిపోయి నాలుగు, ఐదు రోజులు తరువాత వచ్చేవాడని అదేవిధంగా వస్తాడు అనుకొని కుటుంబ సభ్యులు వదిలేసారని చెప్పారు. ఆదివారం జానపాడు గ్రామంలోని చేపల చెరువులో కుళ్ళిపోయిన స్థితిలో మృతదేహం కనిపించడంతో స్థానికులు అందించిన సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకొని చెరువు నుంచి మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించగా సుబ్బారావుగా గుర్తించినట్లు పోలీసులు తెలియజేశారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పట్టణ ఎస్ఐ మోహన్ తెలియజేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు పేర్కొన్నారు.

నేడు గుంటూరులో సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ : దేశ రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్న తరుణంలో మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి అనుసరిస్తున్న రాజకీయ విధానాలు, అడ్డు అదుపు లేకుండా పెరుగుతున్న ధరలు, ఆర్థిక మాంద్యం, మతోన్మాదం తదితర అంశాలపై సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు, గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరుగు సమకాలీన రాజకీయ పరిణామాలపై జరుగు సభను జయప్రదం చేయాలని, సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం ఎం.టి.ఎం.సి పరిధిలోని చిర్రావూరు గ్రామంలో సిపిఎం నాయకులు కరపత్రాల పంపిణీ చేస్తూ, విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ బిజెపి భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించి, మతోన్మాద పాలన సాగిస్తుందని అన్నారు. గుంటూరులో జరిగే సమకాలీన రాజకీయ పరిణామాలపై జరిగే సభకు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, శాసనమండలి సభ్యులు కే.ఎస్ లక్ష్మణరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు, తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని అన్నారు. ఈ సభను జయప్రదం చేసేందుకు సిపిఎం సభ్యులు, సానుభూతిపరులు, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, మధ్య తరగతి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని సభను జయప్రదం చేయాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, సిపిఎం చిర్రావూరు గ్రామ కార్యదర్శి బొప్పన గోపాలరావు, సిపిఎం నాయకులు పరిమిశెట్టి శివ నాగేశ్వరరావు, పల్లపాటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి బిందె పానకం రూ.30

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి శ్రీ పానకాల నరసింహ స్వామి వారి ఆలయ ంలో స్థానిక శాసనసభ్యులు, మంత్రి నారా లోకేష్ సూచనలతో లాభాపేక్ష లేకుండా పానకాన్ని తయారీ చేసి, విక్రయించేలా అక్షయపాత్ర ఫౌండేషన్‌కు ఆదేశాలు జారీ చేసినట్లుగా సహాయ కమిషనర్, ఆలయ ఈవో ఏ రామకోటి రెడ్డి ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. అక్టోబర్ 21 నుండి ఒక బిందె పానకం రూ. 30లకు యాత్రికులకు విక్రయిస్తారని, ప్రతి రోజు ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 3: 30 నిమిషాల వరకు పానకం నివేదన ఉంటుందని తెలిపారు.



ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు నుండి అవార్డును అందుకుంటున్న అంబటి శ్రీనివాసరావు దంపతులు

అంబటి శ్రీనివాసరావుకు నాగయ్య అవార్డు

ప్రజాశక్తి - దాచేపల్లి

దక్షిణాది రాష్ట్రాల అధ్యాపకులు, ఉపాధ్యాయుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు నాగయ్య అవార్డును స్థానిక శ్రీ వికాస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, సరస్వతి డిగ్రీ కళాశాల డైరెక్టర్ అంబటి శ్రీనివాసరావు అందుకున్నారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా గుంటూరులో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డును ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఆదివారంప్రదానం చేశారు. 30 ఏళ్ల నుండి అధ్యాపక వృత్తిలో ఉంటూ రెండు విద్యాసంస్థలను విజయవంతంగా నిర్వహించడంతోపాటు ఎంతోమంది విద్యార్థులు వివిధ రంగాల్లో స్థిరపడారని దారి చూసిన ఆయనకు ఈ అవార్డు దక్కింది. అంబటి శ్రీనివాసరావుకు గతంలోనే డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభ అవార్డు కూడా వచ్చింది.



కొమెరపూడిలో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మండలంలోని కొమెరపూడిలో పోలీసులు సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లల్లో సోదాలు చేశారు. గడ్డి వాములు, పశువుల పాకలను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని 25 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంతతను కాపాడ్డంలో పోలీసులకు అందరూ సహకరించాలని కోరారు. తనిఖీల్లో సిఐలు పి.శ్రీనివాసరావు, బ్రహ్మయ్య, ఎంవీ సుబ్బారావు, సురేష్, ఎస్‌ఐలు అమినుద్దిన్, సంధ్యారాణి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

టెయిల్‌పాండ్ నుండి పులిచింతలకు నీరు

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని సత్రశాల వద్ద కృష్ణా నదిపై నిర్మితమైన నాగార్జున సాగర్ టైల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి దిగువన ఉన్న పులిచింతలకు 2,36,818 క్యూసెక్కుల నీటిని 14 క్రస్ట్ గేట్ల ద్వారా విడుదల చేస్తున్నట్లు ఎస్ఇ వెంకటరమణ ఆదివారం తెలిపారు. ఎగువన ఉన్న నాగార్జునసాగర్ నుండి వచ్చిన నీరు వచ్చినట్లు దిగువకు పంపుతున్నట్లు చెప్పారు.



కృష్ణా జలాశయంలో 10 లక్షల చేపపిల్లలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : మత్స్యకారుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. మాచర్ల మండలం అనుపు కృష్ణా జలాశయంలో 10 లక్షల చేప పిల్లలను ఆయన ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాగార్జున సాగర్ కాలనీలో మత్స్యకారులకు వాటర్ ప్లాంట్, రోడ్లు నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. తాజాగా విడుదల చేసిన చేపలు మత్స్యకారుల ఉపాధికి ఉపకరిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖాధికారి సంజీవరావు, టిడిపి మండల అధ్యక్షులు ఎన్.వీరాస్వామి యాదవ్, నాయకులు పి.పుల్లయ్య, బి.వెంకటేశ్వర్లు, మత్స్యకారుల సంఘం అధ్యక్షులు ఎం.అప్పలరాజు, డాక్టర్ ఎన్.బసివిరెడ్డి పాల్గొన్నారు.



దశాబ్ధాల కలగానే వరికపూడిసెల

సత్వరం నిర్మించాలని సిపిఎం మాచర్ల పట్టణ మహాసభ డిమాండ్



మహాసభలో మాట్లాడుతున్న జి.రవిబాబు

ప్రజాశక్తి- మాచర్ల

సిపిఎం పట్టణ మహాసభ స్థానిక ఆ పార్టీ కార్యాలయంలోని సీతారాం ఏచూరి నగర్‌లో ఆదివారం నిర్వహించారు. తొలుత సిపిఎం జెండాను సీనియర్ నాయకులు యు.రమేష్ ఆవిష్కరించారు. సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి నాయకులు పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం బి.శ్రీను అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు మాట్లాడుతూ మోడీ పాలనలో దేశం అప్పుడు రూ.50 వేల కోట్ల నుండి రూ.లక్షన్నర కోట్లకు పెరిగిందని, అదే సమయంలో ప్రజల్లో అసమానతలూ పెరిగాయని చెప్పారు. సమస్యలపై పోరాడే వారిని కుల, మతాల పేరుతో విద్వేషాలు రేపుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలోని పాలకులూ మోడీ చెప్పుల్లో కాళ్లు పెట్టి పాలిస్తున్నారని, రాష్ట్రాల హక్కులు హరించబడుతున్నా నోరు మెదపడం లేదని విమర్శించారు. ధరలు పెరిగి ప్రజల జీవనం కష్టంగా మారిందని, ఆర్థిక సమస్యలు చుట్టుముడుతున్నాయని చెప్పారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ పల్నాడు ప్రాంతం అభివృద్ధికి దూరంగా ఉందని, ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలు పాలక పార్టీలు గాలికొదిలేస్తున్నాయని విమర్శించారు. పక్కనే కృష్ణానది ఉన్నా ఇక్కడి ప్రజలు మాత్రం తాగు, సాగు నీటికి కటకటలాడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. వరికపూడిసెల ప్రాజెక్టు దశాబ్ధాలుగా కలగానే మిగిలిందని ఆవేదన వెలిబుచ్చారు. తాజా ప్రభుత్వం కొత్త పథకాలేమీ ప్రారంభించకపోగా ప్రజలపై భారాలు వేయడానికి సిద్ధమైందన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై తీర్మానాలను మహాసభ ఆమోదించింది. వరికపూడిసెల ప్రాజెక్టును నిర్మించాలని, మాచర్ల ప్రభుత్వాస్పత్రిని 100 పడకల స్థాయికి అభివృద్ధి చేయాలని, బుగ్గవాగు నుంచి మాచర్లకు తాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ తీర్మానించింది. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా బండ్ల మహేష్, సభ్యులుగా కొత్త వెంకటరత్నం, వై.సురేష్, తిక్కా నాగేశ్వరరావు, ఎస్.రాజు, కుక్కడాల రామయ్య, వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. కె.ఆదినారాయణ, రాజు, చంద్రకళ, వెంకటరమణ, వెంకట్రావ్, శోభన్‌కుమార్, వి.వెంకట్రావ్, శోభన్‌కుమార్, జోతీష్‌కుమార్, రాజు పాల్గొన్నారు.



సిమెంట్ ఫ్యాక్టరీలకు భూమిలిచ్చిన రైతులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-దాచేపల్లి : స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ మండల మహాసభను సాంబయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఫ్యాక్టరీల నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని, ఆ కుటుంబాలకు కంపెనీల్లో శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు ఇవ్వాలని, దాచేపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీని ఏర్పాటు, సిమెంటు కాలుష్యం వల్ల నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తీర్మానాలను మహాసభ ఆమోదించింది. ఈ సందర్భంగా మొండల కన్వీనర్‌గా ఆంజనేయరాజును, సభ్యులుగా రాఘవరావు, జల్లెపల్లి వెంకటేశ్వర్లు, గుంజి గోవింద్, ప్రసాద్, నరేంద్ర, గోవిందాచారిని ఎన్నుకున్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, నాయకులు డి.శివకుమారి పాల్గొన్నారు.







రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఎ.వరప్రసాద్, జి.సాయి చైతన్య, రిషివర్ధన్, వి.శ్రీదేవి, షేక్ శైలు

సాఫ్ట్‌బాల్ రాష్టస్థాయి పోటీలకు ఐదుగురు రొంపిచర్ల జెడ్‌పి విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మండల కేంద్రంమైన రొంపిచర్ల జెడ్‌పి పాఠశాల విద్యార్థులు ఐదుగురు అండర్-14 రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం బి.ఎం.సుభానీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న నరసరావుపేట ఎస్‌ఎస్‌ఎన్ కళాశాలలో జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయి బాల, బాలికల సాఫ్ట్‌బాల్ క్రీడల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని పేర్కొన్నారు. బాలుర విభాగంలో ఎ.వరప్రసాద్, జి.సాయిచైతన్య, రిషివర్ధన్, బాలికల విభాగంలో వి.శ్రీదేవి, షేక్ శైలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని, వచ్చేనెల 16 నుండి చిత్తూరు జిల్లాలో పోటీల్లో వీరు ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఎంపికైన వారిని హెచ్‌ఎంతోపాటు పిఇటి సైదయ్య, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఏడుకొండలు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఇంటర్నేషనల్ హాఫ్ మారధాన్‌లో వినుకొండ వాసి అబ్దుల్లా ప్రతిభ

ప్రజాశక్తి - వినుకొండ



జమ్మూ కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో జరిగిన ఇంటర్నేషనల్ హాఫ్ మారథాన్-2024లో వినుకొండకు చెందిన యువ క్రీడాకారుడు షేక్ అబ్దుల్లా ప్రతిభ చూపాడు. ఈ పోటీలో కెన్యా, చైనా, నేపాల్, స్వీడన్, యుఎఇ దేశాలు పాల్గొన్నాయి. ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు ప్రారంభమైన మారథాన్‌లో మొదటి మూడు స్థానాలను కెన్యా క్రీడాకారులు సాధించగా, భారతదేశం నుండి పాల్గొన్న క్రీడాకారుల్లో ఒకరైన అబ్దుల్లా 10వ స్థానాన్ని దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఒలింపిక్స్‌లో దేశానికి పతకాలు సాధించాలనేది తన లక్ష్యమన్నారు.



కార్తీక్‌ను అభినందిస్తున్న డిఇఒ ఎం.వెంకటేశ్వర రావు

బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీలకు మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు పల్నాడు జిల్లా నుంచి డి.కార్తీక్ ఎంపికైనట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పల్నాడు జిల్లా కార్యదర్శి సురేష్ తెలిపారు. ఈ నెల 18న నరసరావుపేట ఎస్‌ఎస్‌ఎన్ కళాశాలలో నిర్వహించిన అండర్-17 విభాగంలో పట్టణంలోని బరంపేటలోని ఎస్‌బిఆర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి డి.కార్తీక్ బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో జరిగే అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి పోటీల్లో కార్తిక్ పాల్గొననున్నట్లు చెప్పారు. అక్కడకూడా బాగా రాణించి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ చిన్నతనం నుండి బ్యాడ్మింటన్ అంటే ఎంతో ఇష్టమని, దానికి తగిన విధంగానే తల్లిదండ్రులు సైతం బాగా ప్రోత్సహించారని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని విజయాలు సాధించి పల్నాడు జిల్లాతోపాటు తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తెస్తానని ధీమా వ్యకర్తం చేశారు. కార్తీక్‌ను పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అభినందించారు.

కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలి

మేకా అమరారెడ్డి వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్

ప్రజాశక్తి-తాడేపల్లి




మాట్లాడుతున్న పాశం రామారావు, హాజరైన ప్రజలు

ప్రజల కోసం జండాలెత్తి-ప్రజల కోసం ప్రాణాలు ఇచ్చిన కమ్యూనిస్టు ఉద్యమ త్యాగాల పురిటిగడ్డ తాడేపల్లి అని, అందులో మొదటి వరుసలో మేక అమరారెడ్డి, బండారు ముత్యాలు, వెన్నపూస మాలకొండ రెడ్డి ఉన్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు చెప్పారు. ఆదివారం రాత్రి తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం సమీ పంలోని అమరవీరుల స్థూపం వద్ద మేక అమరారెడ్డి 43 వర్ధంతి సభ సిపిఎం పట్టణ కార్యదర్శి బోరుగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ తాడేపల్లి ప్రాంతంలో వేలాదిమందికి ఇళ్ల స్థలాలు. ఇల్లు వేయించిన చరిత్ర సిపిఎం దేనని స్పష్టం చేశారు. ఇందులో అమరారెడ్డి లాంటి త్యాగధనుల పాత్ర ఉందని కొనియాడారు. దేశంలో బిజెపి మతోన్మాదాన్ని నికరంగా వ్యతిరేకిస్తున్న పార్టీ సిపిఎం అని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 400 సీట్లు గెలుస్తామని గొప్పలకు పోయి పూర్తి మెజారిటీ తెచ్చుకోలేక బిజెపి వెనక బడిపోయిందనిపోయిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని టిడిపి ఆధారంతో కేంద్రంలోని పచ్చి మతోన్మాద బిజెపి పార్టీ అధికారం వెలగబెడుతుందని మండిపడ్డారు. బిజెపితో జత కట్టిన ఏ ప్రాంతీయ పార్టీ బతికి బట్ట కట్టలేదని విషయం త్వరలోనే టిడిపికి అర్థం అవుతుందని చెప్పారు. దేశ రక్షణ కోసం. ప్రజల సంరక్షణ కోసం నేటికీ సిపిఎం నికరంగా నిలబడిందని తెలిపారు. రాహుల్ గాంధీ ఇటీవల సిపిఎం అఖిలభారత కార్యదర్శి మరణం సందర్భంగా ఇండియా కూటమి రూపశిల్పినీ కోల్పోయామని ఆయన చేసిన వ్యాఖ్యలే నిదర్శనమని చెప్పారు. ఇటీవల దేశంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా నిత్యవసర సరుకుల ధరలతో పాటు గ్యాస, పెట్రోల్ ధరలు పెరగటం బిజెపి వల్లేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి తీసుకొస్తాను అంటున్న జెమినీ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి తీసుకొచ్చిన క్రిమినల్ చట్టాలు ప్రజా ఉద్యమకారుల ను అనుచడానికి ఉపయోగపడతాయని తెలిపారు. దుర్మార్గమైన ఈ చట్టాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేయవలసిన అవసరం ఉందని చెప్పారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను, సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇసుక విధానం వల్ల గత ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వంలో ధరలు అధికంగా ఉన్నాయని నిర్మాణ కార్మికులు చెబుతున్న సంగతిని ప్రభుత్వం గుర్తించాలన్నారు. రాజధాని నిర్మాణానికి రూ.1500 కోట్లు ప్రపంచ బ్యాంకు నుండి రాష్ట్రానికి అప్పు ఇప్పిస్తే, అదేదో కేంద్ర ప్రభుత్వం ఇచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవటం సరైంది కాదన్నారు. మంగళగిరి ఎమ్మెల్యే. రాష్ట్ర విద్యా ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకర్ రావు మాట్లాడుతూ ఇటీవల తాడేపల్లి సుందరయ్య నగర్, మహానాడు, కృష్ణవేణి నగర్ లలో వచ్చిన వరద బాధితులకు ఇంతవరకు పూర్తిగా నష్టపరిహారం అందజేయపోవటం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మికులు, దళితుల హక్కుల కోసం స్పందించి పనిచేసిన చరిత్ర సిపిఎం దేనని స్పష్టం చేశారు. తాడేపల్లి ప్రాంతంలో 13 వేల మంది కి ఇళ్ల స్థలాలు ఇప్పించిన ఘనత ఎర్రజెండాకే దక్కుతుందని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం రవి మాట్లాడుతూ ప్రజలపై ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో భారం మోపటాన్ని చూస్తే గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా లేదని స్పష్టమవుతుందని విమర్శించారు. సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ అమరవీరుల పోరాటాల స్ఫూర్తితో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ముందుగా స్తూపం వద్ద గల మేక అమరారెడ్డి, బండారు ముత్యాలు, వెన్నపూస మాలకొండ రెడ్డి విగ్రహాలకు పాశం రామారావు, గాదె సుబ్బారెడ్డి, వేముల దుర్గారావు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సిపిఎం. సిఐటియు జెండాలను ఎం రవి, జొన్న శివశంకరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు ఏ జగన్ విప్లవ గీతాలు ఆలపించారు. సభలో సిపిఎం రూరల్ కార్యదర్శి దొంతి రెడ్డి వెంకట్ రెడ్డి, తాడేపల్లి మాజీ సర్పంచ్ డి శ్రీనివాస్ కుమారి, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు గాదిసుబ్బారెడ్డి, కొట్టే కరుణాకర్ రావు పాల్గొన్నారు. ముందుగా వక్తలను సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి కోట బాబురావు వేదికపైకి ఆహ్వానించారు.

ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతి

ప్రజాశక్తి-తాడేపల్లి

ఆదివారం ఉదయం నుండి ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. బ్యారేజీ 70 గేట్లలో 40 గేట్లు రెండు అడుగులు 30 గేట్లు ఒక అడుగు మేర పెట్టి 84 వేల 297 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నట్లు బ్యారేజీ ఏఈ దినేష్ తెలిపారు. కృష్ణ పశ్చిమ డెల్టా , బందర్ రైవీస్, ఏలూరు కాలువలకు 6,500 క్యూసెక్కులు విడుదల చేసినట్టు చెప్పారు పులిచింతల నుండి నీరు విడుదల చేయడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద నీటిమట్టం పెరిగినట్లు అధికారులు ధ్రువీకరించారు.

డాక్టర్ ప్రజ్ఞాచారికి జాతీయస్థాయి జాషువా సాహితీ పురస్కారం

ప్రజాశక్తి - తెనాలి

మహాకవి గుర్రం జాషువా జాతీయస్థాయి సాహితీ పురస్కారాన్ని ప్రముఖ కవి, రచయిత డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి అందుకున్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అక్కడి ఐఎంఎ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు కంచర్ల బుల్లిబాబు, స్వామి మాట్లాడుతూ వివిధ రంగాలలో ప్రతిభావంతులను ఎంపిక చేసి పురస్కార ప్రధానోత్సవం నిర్వహిస్తున్నామని, సాహితీ రంగంలో కొలకలూరుకు చెందిన డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారిని ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రజ్ఞాచారి మాట్లాడుతూ నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువ పేరిట ప్రఖ్యాత పురస్కారం అందుకోవటం ఆనందంగా ఉందని, జాషువా పురస్కారంతో కలిపి తాను జాతీయస్థాయిలో ఏడు అవార్డులు అందుకున్నట్లు ప్రజ్ఞాచారి తెలిపారు. పురస్కారాన్ని అందుకున్న డాక్టర్ పూర్ణ ప్రజ్ఞాచారిని సాహితీ ప్రియులు, గ్రామస్తులు అభినందించారు.



ప్రజ్ఞాచారిని సత్కరిస్తున్న హెల్ప్ ఫౌండేషన్ బృందం

ఉచిత ఇసుక హామీని అమలు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఫిరంగిపురం

ఇసుక సమస్యను పరిష్క రించాలి, భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరి ంచాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఫిరంగిపురం మం డలం పొనుగుపాడు గ్రామంలో శ్రీనివాస్ అధ్యక్షతన విస్తృత సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మాటలే తప్ప చేతలలో అడుగు కూడా ముందుకు పడట్లేదు అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బ్లాక్ మార్కెట్ ను ప్రోత్సహిస్తూ ఇసుక దందాకు తెర లేపారే తప్ప ప్రజలకు ఉపయోగపడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సైతం బ్లాక్ మార్కెట్‌ను అరికడతామని చెబుతున్నప్పటికీ ఆచరణలో అమలు జరగడం లేదని అన్నారు. ఇప్పటికైనా చిత్తశుద్ధి ఉంటే ముఖ్యమంత్రి బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి కావలసిన వారందరికీ ఉచిత ఇసుకను అందుబాటులోకి తేవాలన్నారు. టిడిపి ప్రభుత్వ పాలన పనితీరు చూస్తుంటే వైసీపీ పాలనకు జగన్ పాలనకు తేడా లేదని అర్థమవుతుందని అన్నారు. ప్రజాగళం యాత్రలో, మేనిఫెస్టోలో చెప్పినట్లుగా టిడిపి ప్రభుత్వం వెంటనే భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో ఉన్న నిధులను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ఉపయోగించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులపై ఏమాత్రం శ్రద్ధ ఉన్న తక్షణమే సంక్షేమ బోర్డు చైర్మన్, సభ్యులను నియమించి పని ప్రారంభించాలన్నారు. అనంతరం ఆరుగురు సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి షేక్ మస్తాన్వలి, మధు, రవి, రాము, ఫణీంద్ర, గోపి, కుంభాసుశీలరావు, కోటేశ్వరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు : తుళ్లూరు ఏరియా భవన నిర్మాణ కార్మిక సంఘం విస్తృత సమావేశం తుళ్లూరు సిఐటియు ఆఫీసులో నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మన ప్రభుత్వం రాగానే ఉచిత ఇసుక ఇస్తామని భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునర్దిస్తామని హామీ ఇచ్చారని 120 రోజులు నడుస్తున్నప్పటికీ ఇప్పటికీ ఉచిత ఇసుక ఇవ్వలేదని పనులు లేక భవన నిర్మాణ కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజు మాట్లాడుతూ, స్థానికంగా రాజధాని పనులు ప్రారంభమైనప్పటికీ స్థానిక భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా బయట నుండి కార్మికులను తీసుకొచ్చి పనులు చేస్తున్నారని, దీని ద్వారా కార్మికులు లేక ఇబ్బం దులకు గురవుతున్నారని కావున రాజధాని నిర్మాణంలో స్థానిక భవనిర్మాణ కార్మికును భాగస్వామ్యాలను చేయాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం రవి, సిఐటియు నాయకులు పి బాబు, జి చెంచయ్య, కే పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.



తుళ్లూరు సమావేశంలో మాట్లాడుతున్న దండా లక్ష్మీనారాయణ



రాష్ట్ర స్థాయి పోటీలకు వేజెండ్ల విద్యార్థినులు

ప్రజాశక్తి - చేబ్రోలు

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు వేజెండ్ల ఉన్నత పాఠశాల విద్యార్థినిలు ఐదుగురు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు తిరుమల విజయశ్రీ శనివారం తెలిపారు. అనంతపురం జిల్లా హిందూపురంలో అక్టోబర్ 21 నుండి 23 వరకు నిర్వహించే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈనెల 17న మండలంలోని వేజెండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారని, తమ పాఠశాల విద్యార్థులు మట్టుపల్లి సుమశ్రీ, బింగినపల్లి మనీషా, చల్ల గిరి గీతా మాధురి, మోటుపల్లి జయ సంజన, పఠాన్ షాహేదా ఐదుగురు బాలికలు ఎంపికయ్యారని విజయశ్రీ తెలిపారు. వీరికి కె కె ఆర్ సెల్ పాయింట్ కోటి శ్రీ సాయిరాం క్రీడా దుస్తులను బహుకరించారు. విద్యార్థినులను, వ్యాయామ ఉపాధ్యాయులు తిరుమల శెట్టి వెంకటేశ్వరరావు, కోటి శ్రీ సాయిరాంలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు అభినందించారు.

సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పొల్యూషన్ కంట్రోల్ కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎంఎస్ సి సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ అండ్ పొల్యూషన్ కంట్రోల్ (వాటర్, ఎనర్జీ, ఆయిల్, గ్యాస్) కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విభాగాధిపతి ఆచార్య పి.బ్రహ్మాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో ప్రవేశాలు పొందేందుకు బీఎస్సీ, బీటెక్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఆయా కోర్సుల్లో ఏ బ్రాంచ్‌లో ఉత్తీర్ణులైన కూడా అర్హత కల్పిస్తామని తెలిపారు. కోర్స్ ఫీజు రూ.20 వేలుగా నిర్ణయించినట్లు బ్రహ్మాజీ రావు వివరించారు. కొద్ది సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వివరాలకు 9441924560 ఫోన్ నెంబర్ ను సంప్రదించవచ్చునని బ్రహ్మాజీరావు పేర్కొన్నారు.



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న బైరగాని శ్రీనివాసరావు తదితరులు

జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - ఫిరంగిపురం

తక్కెళ్లపాడు గ్రామంలో జగనన్న కాలనీకి రోడ్డు, విద్యుత్, కనీస మౌలిక వసతులు కల్పించాలని, డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని, నాగార్జునసాగర్ కాలువ వంతెనకు రెండు వైపులా రక్షణ ఏర్పాటు చేపట్టాలని, తాళ్లూరు నుండి కండ్రిగ, ఎర్రగుంటపాడు వెళ్లే రోడ్లు వేయాలని తక్కెళ్లపాడు శాఖ మహాసభ తీర్మానం చేసింది. శనివారం మండలంలోని తక్కెళ్లపాడులో నాయకులు రజనీ అధ్యక్షతన గ్రామశాఖ మహాసభ నిర్వహించారు. సభలో ముందుగా సిపిఎం జాతీయ నేత సీతారాం ఏచూరి తదితరులకు నివాళులర్పించారు. సభలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బైరగాని శ్రీనివాసరావు ప్రసంగించారు. 21న గుంటూరు వెంకటేశ్వరా విజ్ఞాన మందిరంలో నిర్వహించే సమకాలీన రాజకీయాలపై సభను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం మహాసభ నూతన కార్యదర్శిగా మార్పుల వెంగళరెడ్డిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి షేక్ మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణకారుల కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

స్వర్ణకారులకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై మాచర్ల పట్టణ విశ్వబ్రాహ్మణ స్వర్ణకారుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఆదివారం మాచర్ల పట్టణ విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపంలో జరిగిన సమావేశంలో టిడిపి నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సాధికారిక సమితి కన్వీనర్ కూరెళ్ల వీరబ్రహ్మాచారి మాట్లాడుతూ స్వర్ణకారుల కార్పొరేషన్ ద్వారా పేద కార్మికులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎస్.వేణు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.శ్రీనివాసచారి, పి.కాశీపతి, కె.భాస్కరాచారి, టి.రవిబాబు పాల్గొన్నారు.

రూ.1.18 కోట్లతో రహదారి మరమ్మతులు

ప్రజాశక్తి- రెంటచింతల

మండలంలోని వివిధ గ్రామాల రహదారులు అధ్వానంగా ఉన్న నేపథ్యంలో మంజూరైన రూ.1.18 కోట్లతో వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. కొద్ది రోజుల్లో కార్తీకమాసం ఆరంభం కావడంతో రాకపోకలు పెరుగుతాయని, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా పాలువాయి జంక్షన్ నుండి సత్రశాల వెళ్లే రహదారి ఇతర రహదారి పనులు ప్రారంభించాలని చెప్పారు. దీంతో ఆర్ అండ్ బి డిఇ రమణయ్య, ఎఇ యూసఫ్ పలు రహదారులు ఆదివారం పరిశీలించారు. పాలువాయి జంక్షన్ నుండి సత్రశాల రూ.40 లక్షలు, పాలువాయి జంక్షన్ నుండి తుమ్మకోటకు రూ.18 లక్షలు, రెంటచింతల నుండి గోలికి రూ.40 లక్షలు, మెట్టుగుడుపాడు నుండి సమాధానంపేటకు రూ.20 లక్షలు మరమ్మతుల కోసం మంజూరైనట్లు తెలిపారు.

డ్రోన్‌లపై ఈశ్వర్ ఇంజినీరింగ్‌లో నేడు వర్క్‌షాప్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : సాంకేతిక రంగంలో డ్రోన్‌ల ద్వారా ఎన్నో ఉపయోగాలున్నాయని, ప్రస్తుతం వ్యవసాయ రంగంలోనూ డ్రోన్‌ల వినియోగం పెరిగిందని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ షేక్.మీరావలి అన్నారు. ఈ నేపథ్యంలో డ్రోన్‌ల ప్రాముఖ్యతను వివరించేందుకు తమ కళాశాలలో సోమవారం ఇండియా డ్రోన్ అకాడమీ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. నరసరావుపేట మండలంలోని కేసనపల్లి గ్రామ పరిధిలో తమ కళాశాలలో నిర్వహించనున్న వర్క్‌షాప్‌లో డ్రోన్ల వినియోగం, వాటి ఉపయోగాలపై వివరించనున్నట్లు తెలిపారు. పల్నాడు ప్రాంతంలో ఇంతవరకు డ్రోన్ల వర్క్‌షాప్‌పై సదస్సు ఎక్కడా నిర్వహించలేదని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీం మోహిద్దీన్, మేనేజింగ్ డైరెక్టర్ షేక్.మస్తాన్‌షరీఫ్ చెప్పారు. రహదారులు, వ్యవసాయం, నిర్మాణాభివృద్ధి, విపత్తుల్లో డ్రోన్ ప్రాముఖ్యత పెరిగిందన్నారు. రానున్న కాలంలో మరింతగా డ్రోన్లకు ప్రాధాన్యత సంతరించుకొనుందన్నారు. ఈ నేపథ్యంలో నిర్వహించే వర్క్‌షాప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు సూచించారు.

పశువులను రోడ్లపై వదిలేస్తే చర్యలు

ప్రజాశక్తి - వినుకొండ : రహదార్లపై విచ్చలవిడిగా తిరుగుతున్న ఆవులను మున్సిపల్ సిబ్బంది మున్సిపల్ ప్రాంగణానికి తరలించారు. ఇది తెలిసిన కొంతమంది యజమానులు వచ్చి అపరాధ రుసుం చెల్లించి వాటిని విడిపించుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ అవులను మరోసారి వదిలేస్తే శ్రీశైలం గోశాలకు తరలిస్తామని చెప్పారు. పారిశుధ్యం, ప్రమాదాల నివారణలో భాగంగా ఈ చర్యలు చేపట్టామని, దీనిపై గతంలోనే నోటీసులు జారీచేశామని చెప్పారు.

సమస్యలను పరిష్కరించకుంటే 29న సమ్మె

ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య మిత్ర కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ - నేడు జిల్లా కలెక్టరేట్లలో వినతిపత్రాలివ్వాలని పిలుపు

ప్రజాశక్తి - వినుకొండ

డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో పనిచేస్తున్న వైద్య మిత్రుల సమస్యలపై సోమవారం జరిగే కలెక్టరేట్ గ్రీవెన్స్‌లలో వినతిపత్రాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య మిత్ర కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ పిలుపునిచ్చింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మాచర్ల బుజ్జి స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో 2 వేల మంది వైద్య మిత్రలు, జిల్లా మేనేజర్లు, టీం లీడర్ 17 ఏళ్లుగా పనిచేస్తున్నారని, వారికి ఉద్యోగ భద్రత, క్యాడర్ లేదని చెప్పారు. అతి తక్కువ వేతనంతో చేస్తున్న తమకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కేడర్, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ మేరకు ఈనెల 23న జరిగే క్యాబినెట్ సమావేశంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. లేకుంటే ఈ నెల 29న రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగుతామని ప్రకటించారు. కార్యక్రమంలో సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంత్‌రెడ్డి, నాయకులు ఎం.తిరుమలలక్ష్మి, ఎస్.కె రంజాన్‌బి, వెంకటేశ్వర్లు, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.



హామీలను విస్మరించి భారాలు వేయొద్దు : సిపిఎం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

సిపిఎం మండల మహాసభలో పండరిపురంలోని ఆ పార్టీ కార్యాలయంలోని పేరుబోయిన రాములు నగర్‌లో ఆదివారం జరిగింది. జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికలప్పుడు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విద్యుత్ భారాలు వేయడానికి ఉపక్రమించిందని విమర్శించారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలపై కొత్త భారాలు వేయొద్దని, హామీల ప్రకారం సంక్షేమ పథకాలు సత్వరమే అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై తీర్మానాలను మహాసభ ఆమోదించింది. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా పేరురుబోయిన వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులుగా పి.శ్రీనివాసరావు, జి.సావిత్రి, డి.క్రాంతి, ఎస్.కె.ఫైరోజ్, కె.రోశయ్య, జల్లెడ రాజశేఖర్ ఎన్నికయ్యారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ, నాయకులు బి.శంకర్రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుంటూరు విజయ్‌కుమార్


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి

మునమాక సర్పంచ్ జాన్‌సైదా మృతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలం మునమాక సర్పంచ్ సయ్యద్ జాన్‌సైదా (45) ఆదివారం మృతి చెందారు. కొద్దిరోజులుగా ఆయన అనారోగ్యంతో ఆస్పత్రిలో పొందుతున్నారు. భౌతికకాయాన్ని నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ కె.శ్రీనివాసరెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ పి.రవీంద్రబాబు, నాయకులు పి.వెంకట్రావు, పి.హనిమిరెడ్డి పాల్గొన్నారు.

యుటిఎఫ్ కార్యాలయంలో పట్టభద్రుల ఓటు నమోదు కేంద్రం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలు వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న నేపథ్యంలో ఓటు నమోదు కోసం స్థానిక యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయం ఓటు నమోదు, సహాయ కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 2021 నవంబరు 1 నాటికి డిగ్రీ పాసైన వారంతా ఓటు హక్కు పొందేందుకు అర్హులని, గత ఎమ్మెల్సీ ఓటు ఎన్నికల్లో ఓటేసిన వారుసైతం ఇప్పుడు కూడా ఓటు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఆన్‌లైన్, లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓటు నమోదు కోసం యుటిఎఫ్ ఏర్పాటు చేసిన కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా ఓటు దరఖాస్తు ఫారాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శి కె.తిరుపతి స్వామి, నాయకులు జె.పార్థసారధి, టి.సత్యనారాయణ, బి.నాగేశ్వరావు, డి.కృష్ణబాబు, ఎల్.రాము, యాసీన్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.


దరఖాస్తును ఆవిష్కరిస్తున్న నాయకులు



శ్రీదత్తా హాస్పిటల్‌లో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - వినుకొండ

వరల్డ్ ఆస్టియోపోరోసిస్ డే సందర్భంగా పట్టణంలోని శ్రీదత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు ఎంఎస్ ఆర్థో, జాయింట్ రీప్లేస్‌మెంట్ అర్థోస్కోపిక్ సర్జన్ డాక్టర్ కొరివిపాడు అభిషేక్ తెలిపారు. రూ.రెండు వేల విలువైన వైద్యాన్ని ఉచితంగా అందించామని, దీంతోపాటు అవగాహన కల్పించామని తెలిపారు. బిఎమ్‌డి అనే పరీక్ష నిర్వహించామని, అవసరమైన వారికి ఆపరేషన్ కోసం సిఫార్సు చేశామని అన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ జ్ఞానేశ్వరి, సిబ్బందికి పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత



ప్రజాశక్తి-చిలకలూరిపేట

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో ఎంతో మందికి సిఎం సహాయనిధి అందించామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని తన నివాసంలో 8 మందికి రూ.6.91 లక్షల చెక్కులను ఆదివారం అందించారు. చిలకలూరిపేటకు చెందిన గ్రంధి లక్ష్మీపార్వతికి రూ.51,310, బొందిలి నాగప్రసన్నబాయికి రూ.40,600, గణపవరానికి చెందిన కోమటినేని పావనికి రూ.1.50 లక్షలు, లింగంగుంట్లకు చెందిన మద్దుకూరి రమాదేవికి రూ.95,601, గజ్జల శివకుమార్‌కు రూ.25 వేలు, కావూరుకు చెందిన నాయుడు శ్రీనివాసరావుకు రూ.75 వేలు, అప్పాపురానికి చెందిన ఆరేటి నాగేశ్వరరావుకు రూ.1,51,333, దింతెనపాడుకు చెందిన అత్తోట రామారావుకు రూ.1,02,619 చొప్పున ఇచ్చారు.

ప్రజాశక్తి - రెంటచింతల

వివిధ రకాల జబ్బులతో బాధపడే నిరుపేదలు సీఎం సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మండలంలోని మంచికల్లుకు చెందిన అక్కిపల్లి కొండలకు రూ.1,96,762 చెక్కును ఎమ్మెల్యే ఆదివారం అందించారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటి వరకు నియోజకవర్గంలో 29 మందికి రూ.37.80 లక్షలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గోగుల పుల్లారెడ్డి, వెంకట్రామిరెడ్డి, శీలంనేని సోదరులు పాల్గొన్నారు.



ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట : పేదల ఆరోగ్య పరిరక్షణకు ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట కృషి చేస్తుందని క్లబ్ అధ్యక్షులు జి.సరోజిని అన్నారు. పట్టణంలోని గాంధీపేటలో ఉన్న మంజూ నర్సింగ్‌హోమ్‌లో ఆదివారం ఒక్కొక్కరికి రూ.1200 విలువగల వైద్య పరీక్షలు ఉచితంగా అందజేశారు. సన్ ఫార్మా లేబరెటరీ లిమిటెడ్ సహకారంతో 80 మందికి సుగర్, హెచ్‌బీఏ1సి, థైరాయిడ్, పాదాల న్యూరోపతి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఎన్.జయలక్ష్మి, టి.రమాదేవి, పి.పద్మావతి పాల్గొన్నారు.

జిజిహెచ్‌కి కేటాయించిన స్థలానికి

మూడ్రోజుల్లో హద్దులు గుర్తించాలి



స్థలం మ్యాప్ పరిశీలిస్తున్న కమిషనర్, ఇతర అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని కాకుమాను వారితోటలో ప్రభుత్వ సమగ్ర వైద్యశాలకు కేటాయించిన స్థలాన్ని 3 రోజుల్లో సమగ్ర సర్వే చేసి బౌండరీలు ఫిక్స్ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఆదివారం కమిషనర్ కాకుమాను వారి తోటలోని స్థలాన్ని ప్రభుత్వ వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, కేంద్ర ప్రభుత్వ పరిశీలకులు డాక్టర్ రమేష్, జిఎంసి, సిపిడిసిఎల్ ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులతో కలిసి పరిశీలించి తగు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత మ్యాప్ ద్వారా మొత్తం స్థలం, అందులో జిజిహెచ్‌కి కేటాయించినది తదితర వివరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాకుమాను వారితోటలో ప్రభుత్వ వైద్యశాలకు కేటాయించిన 6 ఎకరాల స్థలంలో ప్రస్తుతం కొంత ఆక్రమణలు జరగడం, పిచ్చి మొక్కలు పెరిగిఉందన్నారు. రాబోయే 3 రోజుల్లో జిఎంసి పట్టణ ప్రణాళిక అధికారుల నేతృత్వంలో సర్వేయర్లు సదరు 6 ఎకరాల స్థలాన్ని సమగ్రంగా సర్వేచేసి, బౌండరీలు ఫిక్స్ చేయాలని ఆదేశించారు. బౌండరీలు ఫిక్స్ చేసిన తర్వాత ఆక్రమణలను, పిచ్చి మొక్కలను తొలగించేందుకు జాయింట్ యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేయాలని పట్టణప్రణాళిక, ప్రజారోగ్య అధికారులకు స్పష్టం చేశారు. సదరు స్థలంలో భవిష్యత్‌లో ఆక్రమణలు జరగకుండా జిజిహెచ్ షుమారు రూ.90 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటుందన్నారు. నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులు ప్రభుత్వ వైద్యశాలకు కేటాయించిన స్థలంలో ప్రజారోగ్య కార్మికులు లేదా చుట్టు పక్కల నివాసితులు వ్యర్థాలు, చెత్త వేయకుండా అవగాహన కల్గించాలని ఆదేశించారు. అనంతరం ఇన్నర్ రింగ్‌రోడ్‌లో ఓసి కోసం దరఖాస్తు చేసుకున్న బహుళ అంతస్తుల భవనాలను పరిశీలించారు. పర్యటనలో సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్.ఈ.నాగమల్లేశ్వరరావు, బయాలజిస్ట్ మధుసూదన్, ఎంహెచ్ఓ రామారావు, ఈఈ కోటేశ్వరరావు, సిపిడిసిఎల్ ఈఈ శ్రీనివాసబాబు, ఏసిపి ఫజులూర్ రెహ్మాన్ పాల్గొన్నారు.

వైవిధ్య ఉత్పత్తులలో అగ్రగామి టాటా

సంస్మరణ సభలో చెరుకూరి కుటుంబరావు



టాటా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కుటుంబరావు, లక్ష్మణరెడ్డి తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రపంచవ్యాప్తంగా 100 దేశాలలో వైవిధ్యం గల వస్తు ఉత్పత్తి చేస్తూ 420 బిలియన్ డాలర్ల వార్షిక ఆదాయంతో ప్రపంచ స్థాయిలో వ్యాపార దిగ్గజంగా టాటా గ్రూప్ గుర్తింపు పొందిందని ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షులు చెరుకూరి కుటుంబరావు పేర్కొన్నారు. ఆదివారం గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో భారత్ ప్రగతిలో టాటాల పాత్ర అనే అంశంపై జరిగిన చర్చా గోష్టిలో కుటుంబరావు ప్రసంగిస్తూ 1868లో ప్రారంభించిన టాటా గ్రూప్ అంచెలంచెలుగా ఎదిగిందన్నారు. దేశానికి ఆర్థిక పునాదులు వేశారని, సంక్షేమం, ధాతృత్వాన్ని చాటి చెప్పారన్నారు. 1912 లోనే 8 గంటల పని విధానాన్ని, 1915లో ఉచిత వైద్య సహాయాన్ని, 1917లో కార్మిక సంక్షేమ విభాగాన్ని, కార్మికుల పిల్లలకు విద్యను అందించడం, 1920లో జీతంతో కూడిన సెలవులు ఇవ్వడం, 1920 లోనే కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్ అమలు చేయడం, 1921లో నైపుణ్యాల అభివృద్ధి సంస్థ ఏర్పాటు లాంటి సంక్షేమ కార్యక్రమాలను భారత దేశంలో మొదటిగా ప్రవేశపెట్టిన ఘనత టాటా గ్రూపులదే అన్నారు. రతన్ టాటా ప్రపంచవ్యాప్తంగా పేరు పొందిన టెట్లీ టీ కంపెనీ, కోరస్ కంపెనీ, జాగ్వర్, లాండ్ రోవర్ కార్లను టాటా గ్రూపుల్లో విలీనం చేసుకుని అభివద్ధిలో పయనించడం భారతదేశానికి గర్వకారణమన్నారు. టాటా గ్రూప్ ల వార్షిక ఆదాయం ప్రపంచంలోని 90 దేశాల జాతీయ ఆదాయాల కన్నా ఎక్కువగా ఉండటం టాటా ల ప్రగతిని తెలియ జేస్తుందన్నారు. శాసనమండలి సభ్యులు కె.ఎస్. లక్ష్మణరావు ప్రసంగిస్తూ టాటా గ్రూప్ భారతదేశంలో పారిశ్రామిక విస్తరణకు, ఉపాధి కల్పనకు, ఉద్యోగుల సంక్షేమానికి ఎనలేని కృషి చేశారన్నారు. క్రోనీ కాపిటలిజం నేడు అమలవుతూ ప్రభుత్వ వనరులను, ప్రజల ధనాన్ని లూటీ చేస్తూ వేలాది కోట్లు సంపాదిస్తున్న పాలకులకు, పారిశ్రామిక వేత్తలకు భిన్నంగా టాటా గ్రూప్ దేశభక్తియుతమైన పారిశ్రామిక వేత్తలుగా ఉండటం అభినందనీయమన్నారు. సభకు అధ్యక్షత వహించిన జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి ప్రసంగిస్తూ టాటా గ్రూపు ప్రారంభంనుండే స్వాతంత్ర్య ఉద్యమానికి విరాళాలు అందించిందన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసంగిస్తూ మహాత్మా గాంధీకి మద్దతుగా నిలిచారని, సహాయ నిరాకరణ, స్వదేశీ ఉద్యమం, దండి సత్యాగ్రహం లాంటి ఉద్యమాలకు అండగా నిలిచారని గుర్తు చేశారు. తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గా ఉన్న డి. సాంబశివరావు విజ్ఞప్తిని మన్నించి రతన్ టాటా క్యాన్సర్ ఆసుపత్రిని నిర్మించారన్నారు. మహాత్మా గాంధీ కళాశాల ప్రిన్సిపాల్ డిఎఆర్ సుబ్రహ్మణ్యం, మానవత చైర్మన్ పావులూరి రమేష్, నేస్తం సహ వ్యవస్థాపకులు టి. ధనుంజయ రెడ్డి,సిరివరపు శ్రీధర్ ప్రసంగించారు.



లక్ష్మణరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే నసీర్ తదితరులు

ప్రైవేటు ఉపాధ్యాయులకు అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి-గుంటూరు

సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఎస్‌పిఎల్‌టిఓ) ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఏసీ కాలేజిలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్యే నసీర్, పలు విద్యా సంస్థల ఛైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దక్షిణ భారతదేశంలోని ఎనిమిది రాష్ట్రాలు, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలకు చెందిన ప్రవేట్ పాఠశాలలు, కాలేజిల డైరెక్టర్లు, వివిధ యూనివర్సిటీల అధ్యాపకులను సన్మానించారు. ఎస్‌పిఎల్‌టిఓ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పి.నాగయ్య మాట్లాడుతూ ఎస్‌పిఎల్‌టిఓ కేవలం ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ సంక్షేమం కోసం ఏర్పడిందని తెలిపారు. ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ సమస్యలపై స్పందిస్తూ వారి సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఎమ్మెల్యే నసీర్‌ను కోరారు. ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు ఇంటి స్థలం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎసి కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోజెస్, ఆంధ్ర క్రైస్తవ న్యాయ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాణిఅమత వర్షిణి, కాటూరి వెంకటేశ్వరరావు, అసోసియేషన్ నాయకులు కె.విల్సన్, కె. గోవిందరావు, ఎస్పీ రసూల్, జహంగీర్ హుస్సేన్, పల్లె రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి జూనియర్ అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించాలి



క్రీడాకారులతో జిల్లెళ్లమూడి వెంకట్ తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అథ్లెటిక్స్‌లో ప్రతిభ కలిగిన వారిని పతకాలు సాధించేలా ప్రోత్సహించాలని ఫ్యాంగ్ టెక్ ల్యాబ్ అధినేత జిల్లెళ్ళమూడి వెంకట్ కోరారు. ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్లో ఈనెల 25 నుంచి 29 వరకు జరిగే జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులను ఆదివారం ఉదయం లక్ష్మీపురంలోని ఫ్యాంగ్ టెక్ ల్యాబ్‌లో ఆయన అభినందించారు. జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ లో బంగారు పతకం సాధిస్తే తమ కంపెనీ నుంచి రూ.లక్ష బహుమతిని అందజేస్తామని తెలిపారు అథ్లెటిక్స్‌లో అధిక శాతం పేద కుటుంబాల నుంచి పాల్గొంటారని, వారికి ప్రోత్సాహాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరు పైన ఉందని తెలిపారు. జిల్లా స్థాయినించే క్రీడాకారులను జాతీయ స్థాయిలో మెడల్స్ కి కొరత ఉండదని ఆయన సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మరో అతిథి కొల్లా అశోక్ మాట్లాడుతూ జిల్లాలో అథ్లెటిక్ క్రీడ అభివద్ధికి తమ వంతు ప్రోత్సాహాన్ని అందిస్తామని తెలిపారు, క్రీడాకారులకు కావాల్సిన క్రీడా పరికరాలు దుస్తులును తమ సంస్థ ప్రోత్సహిస్తుంది అని తెలిపారు. అనంతరం క్రీడాకారులను ఘనంగా సత్కరించి జాతీయ జూనియర్ అథ్లెటిక్ పోటీల్లో పాల్గొనడానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ జిల్లా కార్యదర్శి జి వి ఎస్ ప్రసాద్, అంకాల సుబ్బారావు, కె అరుణ్ కుమార్, శిక్షకులు కే రవి, సి హెచ్ వి రాజులు పాల్గొన్నారు

టైపిస్ట్, స్టెనోగ్రాఫర్స్ రాష్ట్ర అధ్యక్షునిగా మోహన్



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టైపిస్ట్ స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా జి మోహన్ గోపాలకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గుంటూరు జిల్లా అధ్యక్షుడు బి విజయకుమార్ పర్యవేక్షణలో ఆదివారం జరిగిన అసోసియేషన్ జిల్లాల అధ్యక్షులు కార్యదర్శులు సభ్యులు ఈ ఎన్నికలు నిర్వహించారు. కార్యదర్శిగా బీసీ శంకర్ నాయక్ కోశాధికారిగా బి సురేష్ బాబు సహాధ్యక్షులుగా ఏసుబాబు ఉపాధ్యక్షులుగా చెన్నారావు బి బ్రహ్మానందరెడ్డి వి చంద్రశేఖర్ మహమ్మద్ జాకీర్ కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎస్ ఎస్ కే శర్మ జి ప్రాణేశ్వరావు వి రామకష్ణ కే మురళి కార్యదర్శులుగా కె అరుణ్ కుమార్ మహమ్మద్ అలీ ఎస్ కే నజీర్ అహ్మద్ ఎం సుధాకర్ క్రీడా కార్యదర్శిగా యు ప్రవీణ్ కుమార్ మహిళా ప్రతినిధులుగా వాణిశ్రీ దీప ఎన్నికయ్యారు ఎన్నికల అధికారులుగా సిహెచ్ నాగభూషణం పి శివరామకృష్ణ వ్యవహరించారు ఈ సందర్భంగా నూతన కార్య వర్గాన్ని బొకేలు పూలమాలలతో సత్కరించారు.

ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించండి

మంత్రి లోకేష్‌కు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ

ప్రజాశక్తి-తాడేపల్లి

ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, మంగళగిరి ఎమ్మెల్యే, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు ఆదివారం లేఖ రాశారు. అక్రమ లాకౌట్ ప్రకటించి ఇప్పటికీ 32 సంవత్సరాలు అయిన సంగతి వివరించారు. సెంట్రల్ లేబర్ ట్రిబ్యునల్ కోర్ట్, హైకోర్టు, ఫ్యాక్టరీ కి సంబంధించిన భూములు అమ్మి, రూ.43 వేల కోట్లు కార్మికులకు చెల్లించమని ఆదే శించిన సంగతిని కూడా లేఖలో మంత్రి దృష్టికి తెచ్చారు. కోర్టు ఉత్తర్వులను కూడా ఇప్పటివరకు అమలు జరపలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ అక్రమ లాకౌట్ ప్రకటించేనాటికి 333మంది కార్మికులు పని చేస్తుండగా, వారిలో 160 మంది కార్మికులు అనారోగ్యంతో, అర్ధాకలితో మరణించడం జరిగిందని ఆందోళన వెలిబుచ్చారు. సిమెంట్ ఫ్యాక్టరీకి కోట్లాది రూపాయల విలువచేసే భూములు ఉన్న సంగతిని గుర్తు చేశారు. రాష్ట్ర మంత్రిగా ఫ్యాక్టరీ భూములను వెంటనే అమ్మించి, కార్మికులకు నష్ట పరిహారం అందే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నివాసాల మధ్య మద్యం షాపు తొలగించాలని వినతి

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్నం నుండి సుందరయ్య నగర్ వెళ్లే 42 అడుగుల రోడ్డు లో ఉన్న బార్ షాప్ పు తొలగించాలని ఐద్వా ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి ప్రతి రోజాకు వినతి పత్రం అందజేశారు. జనావాసాల మధ్య ఉన్న ఈ బారు వల్ల తాగుబోతులు కిక్కు ఎక్కువై రోడ్డు మీద వీరంగం వేస్తున్నారని మహిళలు తెలిపారు. వచ్చిపోయేవారిపట్ల అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. పంట పొలాల పక్కనే తమ వాహనాలను పార్కింగ్ చేసి, అక్కడే మద్యం తాగి ఖాళీ బాటిల్స్‌ను పొలాల్లో పడవేయడం పట్ల రైతులు కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల మధ్య ఉన్న ఈ బార్ షాపు వల్ల పెద్దలతోపాటు, పిల్లలపై కూడా దుష్ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా అధికారికి అర్జీ ఇచ్చిన వారిలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు. సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు. ఐద్వా నాయకులు కే ఉష. భ్రమరాంబ. భాగ్యలక్ష్మి. లక్ష్మీ భ్రమరాంబ, జ్యోతి, సతీదేవి ఉన్నారు.



పెన్షన్లు అందచేస్తున్న డాక్టర్ చింతా రామకృష్ణ, తదితరులు

అవోపా ఆధ్వర్యంలో పేదలకు పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అరండల్‌పేటలోని అవోపా కార్యాలయంలో ఆదివారం అవోపా అధ్యక్షులు కె.వి.బ్రహ్మం అధ్యక్షతన 108 మంది పేదలకు పెన్షన్లు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ కిడ్నీ వైద్యులు చింతా రామకృష్ణ, చీరాల అవోపా అధ్యక్షులు మురళీ కృష్ణ, 35వ డివిజన్ కార్పొరేటర్ ఈరంటీ వరప్రసాద్ పాల్గొన్నారు. డాక్టర్ చింతా రామకృష్ణ మాట్లాడుతూ పెన్షనర్లకు అవసరమైన వైద్య సదుపాయాలను ఉచితంగా అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రూ.54వేలు పెన్షన్ స్కీంకి అందజేశారు. మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి నెల రూ.500లు చొప్పున 108 మందికి పెన్షన్ ఇవ్వడం, వెయ్యి రూపాయలు విలువచేసే నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడం, వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ఈరంటీ వరప్రసాద్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు దానగుణానికి మారుపేరు అని అవోపా ద్వారా విద్య, వైద్యం అందించడం, మెరిట్ కలిగిన పేద విద్యార్థులకు స్కాలర్షిప్పులు పంపిణీ చేయడం, వరద బాధితులకు రూ.40 లక్షల ఆర్థిక సహాయం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శ్రీమన్నారాయణ, అవోపా కార్యదర్శి రాధాకృష్ణయ్య ట్రెజరర్ మహంకాళి శ్రీనివాసరావు, మద్ది సాయిరమేష్, వెంకట్రావు, ఊటుకూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సమకాలీన రాజకీయ పరిణామాలపై సభ

హాజరు కానున్న బి.వి.రాఘవులు

ప్రజాశక్తి-గుంటూరు

సమకాలీన రాజకీయ పరిణామాలపై నేడు సాయంత్రం 4 గంటలకు గుంటూరు శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే సభను జయప్రదం చేయాలని సిపియం జిల్లా కార్యదర్శి పాశం రామారావు ఒక ప్రకటనలో కోరారు. సభలో సిపియం పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిపియం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్.బాబురావు తదితరులు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. సభ ప్రారంభంలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించబడతాయన్నారు. సభలో వందలాది మంది పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అంతర్జాతీయ వర్క్‌షాప్‌నకు గుంటూరు కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

అర్బన్ ల్యాండ్ రికార్డ్ కోసం సర్వే- రీసర్వేలో ఆధునిక సాంకేతిక విధానాల అమలుపై ఈనెల 21, 22 తేదీల్లో న్యూఢిల్లీలోని అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగే అంతర్జాతీయ వర్క్ షాప్‌లో గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పాల్గొననున్నారు. కేంద్రప్రభుత్వ భూ వనరులు, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈఅంతర్జాతీయ వర్క్‌షాప్‌లో నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్-పట్టణ నివాసాల ఆధారిత భూమి సర్వే (ఎన్ఎకెఎస్‌హెచ్ఎ)లో భాగంగా ఎపిలో ఎంపికైన కుప్పం, మంగళగిరి-తాడేపల్లి, గుంటూరు, ఒంగోలు, ఏలూరు, కాకినాడ, తిరుపతి, అనంతరపురం మునిసిపాలిటీలు, కార్పోరేషన్ల కమిషనర్లు ఈ సదస్సులో పాల్గొంటున్నారు.



జస్టిస్ రవినాథ్ తిల్హరిని సన్మానిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య

ప్రో- బోనో క్లబ్ ద్వారా న్యాయసేవలు

ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రో-బోనో క్లబ్ పథకం ద్వారా న్యాయ సేవలను అందించడంలో ఉన్న అంతరాలను తగ్గించి, ప్రజలకు చట్టపరమైన సహాయం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం, న్యాయవర్గాలు కలిసి పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ లా డిపార్ట్‌మెంట్, మినిస్ట్రీ ఆఫ్ లా అండ్ జస్టిస్ సంయుక్త ఆధ్వర్యంలో న్యాయబంధు పథకం కింద 'ప్రో-బోనో క్లబ్'ను విజ్ఞాన్ యూనివర్సిటీలో ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ రవినాథ్ తిల్హరి మాట్లాడుతూ ఈక్లబ్ ప్రారంభం ద్వారా న్యాయ విద్యనభ్యసించే విద్యార్థులు సామాన్య ప్రజలకు, ముఖ్యంగా పేదలకు చట్టపరమైన సహాయం ఉచితంగా అందించడమే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. న్యాయవాదులు తమ సామర్థ్యాన్ని, సేవలను స్వచ్ఛందంగా అందించడం ద్వారా సామాజిక న్యాయం అందరికీ సమానంగా చేర్చే ప్రయత్నం చేయాలన్నారు. ప్రధానంగా నిరుపేద, మహిళలు, వద్ధులు, దివ్యాంగులు వంటి సమాజంలోని బలహీన వర్గాలకు ఈ పథకం చాలా ఉపయోగకరంగా ఉంటుందని, న్యాయ సేవలు అందుబాటులోకి రావడం ద్వారా వారి హక్కులు, సమస్యలను పరిష్కరించు కోవడంలో ఇది ఒకగొప్ప అవకాశంగా నిలుస్తుందన్నారు. ప్రో బోనో క్లబ్ అనేది స్వచ్ఛందంగా సేవలందించే న్యాయవాదులను సమీకరించే వేదికని, ఇక్కడ వారు సివిల్, క్రిమినల్ కేసుల్లో కూడా సహాయం అందిస్తారన్నారు. విజ్ఞాన్స్ చైర్మన్ డాక్టర్ లావురత్తయ్య మాట్లాడుతూ కొన్ని దేశాలలో ఇప్పటికే ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ జడ్జిల సహాయంతో వేల కేసులను పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు. కాబట్టి విద్యార్థులందరూ న్యాయ విద్యతో పాటు ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి రంగాలలో కూడా పట్టు సాధించాలన్నారు. అప్పుడే భవిష్యత్‌లో ఉన్నత స్థానాలను అధిరోహించగలరని విద్యార్థులకు తెలియజేసారు. ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్ మెంబర్ సెక్రటరీ ఎం.బబిత మాట్లాడుతూ న్యాయం కావాల్సిన వారు 15100 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని, ప్రతి గురు, శనివారాల్లో జిల్లా న్యాయసేవా అథారిటీ ప్యానెల్ అడ్వకేట్ శ్రీరామ్ విజ్ఞాన్ యూనివర్సిటీకి వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు 4వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఆర్.శరత్ బాబు, ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ డెప్యూటీ సెక్రటరీ (సీనియర్ సివిల్ జడ్జి) డాక్టర్ హెచ్.అమరరంగేశ్వరరావు, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ పి.లీలావతి, విజ్ఞాన్స్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

యుజిసి నెట్ లో అర్హత సాధించిన అమర్ చంద్ర

ప్రజాశక్తి తెనాలి



అమర్ చంద్ర

జాతీయ స్థాయిలో యుజిసి నిర్వహించే నేషనల్ ఎలిజిబుల్ టెస్ట్ (నెట్) లో పట్టణానికి చెందిన ఆళ్ళమూడి అమర్ చంద్ర అర్హత సాధించారు. న్యూఢిల్లీ ప్రధాన కేంద్రంగా ఉన్న నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ ద్వారా జాతీయ స్థాయిలో ఈ ఏడాది జూన్ నెలలో నెట్ నిర్వహించారు. పరీక్ష ఫలితాలను యుజిసి రెండు రోజుల క్రితం ప్రకటించిందని, ఈ పరీక్ష లో అర్హత సాధించినవారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడిచే యూనివర్సిటీస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసరు ఉద్యోగానికి అర్హులని, అలాగే యూనివర్సిటీలో పీహెచ్‌డి చేసేందుకు కూడా అర్హులని అమర్ చంద్ర తండ్రి, అంబేద్కర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఆళ్ళమూడి ప్రభాకర్ రావు తెలిపారు. అమర్ చంద్ర పదో తరగతి తరువాత నూజివీడు ట్రిపుల్ ఐటీలో బీటెక్ పూర్తి చేసి, సోషియాలజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. ఈ సందర్భంగా అమర్ చంద్రను ఆదివారం పలువురు అభినందించారు.

జిజిహెచ్‌లో మెరుగైన చికిత్సలు అందిస్తాం

జాప్యం నివారణకు కృషి - పరిశుభ్రతకు ప్రాధాన్యం : ప్రజాశక్తితో సూపరింటెండెంట్ వై.కిరణకుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని సూపరిం టెండెంట్ వై.కిరణకుమార్ తెలిపారు. అత్య వసర విభాగంతో పాటు ఓపిలలో చికిత్సల్లో, మందులను ఇవ్వడంలో జరుగు తున్న జాప్యం నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆస్పత్రిలో అత్యవసర విభాగంతో పాటు వార్డుల్లోకూడా మెరుగైన చికిత్సలకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఆస్పత్రిలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.

అత్యవసర విభాగంలో చికిత్సల్లో జాప్యం?

అత్యవసర విభాగంలో చికిత్సలో జాప్యం నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వేర్వేరు ప్రాంతాల నుంచి 108 వాహనాల్లో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు సత్వరమే వైద్య సేవలు అందిస్తాం. ఉమ్మడి జిల్లాలో ఎక్కడ ప్రమాదం జరిగిన క్షతగాత్రులను, అత్యవసర చికిత్స కోసం 108 వాహనాల్లో వచ్చే రోగులకు వైద్య సేవల్లో ఆలస్యం జరగకుండా ఉండేవిధంగా ప్రణాళికలను రూపొందిస్తున్నాం. 108 వాహన వైద్య సిబ్బంది అత్యవసర విభాగంలోని డ్యూటీ డాక్టర్, ఆర్ యం ఓ లకు సమాచారం అందించగలిగితే వెంటనే వెంటిలేటర్ సాకార్యంతో పాటు అన్నీ విభాగల వైద్యులు అందుబాటులో ఉండే విధంగా చూస్తాం.

అనధికారిక వ్యక్తుల సంచారం నిరోధం ఎలా?

ఆస్పత్రిలో అనధికారిక వ్యక్తుల నిరోధానికి నిఘా పెంచాం. వివిధ వార్డుల్లో ఏజెన్సీ వారు నియమించే ఉద్యోగులకు గుర్తింపు కార్డులు ఉంటున్నాయి. వీరికి బయోమెట్రిక్ ఉంటుంది. వీరు కాకుండా వివిధ విభాగాల్లో ఎవరయినా అనధికారిక వ్యక్తులు పనిచేస్తే గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటాం. పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. ఇటీవల శిశువు అపహరణ ఘటన తరువాత భద్రత కట్టుదిట్టం చేశాం. వార్డుల్లోకి రోగులు, వారి సహాయకులు తప్ప మిగతా వారిని రాకుండా నియంత్రించేందుకు సిసి కెమెరాల ద్వారా నిత్య పరిశీలన చేస్తున్నాం. ఆస్పత్రిలో అనధికారిక వ్యక్తుల వల్ల సిబ్బంది, వైద్యులకు ఇబ్బంది రాకుండా చేస్తున్నాము.

పిల్లల ఆస్పత్రి నిర్మాణం ప్రతిపాదన?

బొంగరాల బీడులో జిజిహెచ్‌కు చెందిన ఆరు ఎకరాల స్థలం కార్పొ రేషన్ అధికారులు అప్పగించారు. పూర్తిగా పత్రాలు అందిన తరువాత అక్రమణలను నిరోధించేందుకు రూ.90 లక్షలతో ప్రహరి నిర్మిస్తాం. తరువాత ప్రత్యేకంగా పిల్లల కోసం ఆస్పత్రి నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం.




డాక్టర్ కిరణ్‌కుమార్



ఉద్యోగులు మహిళలపై దురుసు ప్రవర్తన?

ఇటువంటి ఘటనలను సహించం. ఇటీవల అత్యవసర విభాగంలో రెడియోగ్రాఫర్ శివారెడ్డి స్టాఫ్ నర్సును దూషించిన కేసులో విచారణ జరిపి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతను క్షమాపణ కోరడంతో నర్సులు శాంతి ంచారు.



విజేతలతో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, యుటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయులు వత్తిడిని అధిగమించాలి : ఎమ్మెల్సీ కెఎస్

ప్రజాశక్తి-గుంటూరు :ఉపాధ్యాయులు బోధనతోపాటు క్రీడలు, సాంస్కతిక కార్యక్రమాలలో పాల్గొనటం ద్వారా మానసిక ఒత్తిడిని అదిగమించాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడలు, సాంస్కృతిక పోటీల బహుమతి ప్రధానోత్సవం యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.ఆదిలక్ష్మి అధ్యక్షతన బ్రాడీపేటలోని సంఘ కార్యాల యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పని ఒత్తిడి పెరిగిందని, దీంతో అనారోగ్యాలకు గురవుతుని, కొన్ని సార్లు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. నిత్యంతో మానసిక ఒత్తిడితో ఉండే ఉపాధ్యాయులు దానికి అధిగమించటానికి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల రోజువారీ జీవితంలో భాగంగా చేసుకోవాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో క్రీడలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించడం జరిగిందని ఈ ఘనత యూటీ ఎఫ్‌కు మాత్రమే దక్కుతుందని అన్నారు. టీచర్లు పెద్ద సంఖ్యలో పోటీలలో పాల్గొనటం అభినందనీయం అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ వచ్చే జనవరిలో కాకినాడలో 20 వేల మంది టీచర్లతో స్వర్ణోత్సవ సంబరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి యం.కళాధర్ క్రీడల నిర్వహణకు సహకరించిన వ్యాయామ ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రధాన ఉత్సవం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచు రణల కమిటీ చైర్మన్ యం.హనుమంత రావు, జిల్లా నాయకులు జి.వెంకటేశ్వర్లు, యండి. గయాసుదౌలా, సిహెచ్. ఆది నారాయణ, యు.రాజశేఖర్‌రావు, జి.వెంకట ేశ్వరరావు, ఎం. గోవిందయ్య, టి.ఆంజనేయులు, ఎ.శ్రీనివాస రావు, కె.కేదార్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణతో కుల వ్యవస్థకు ప్రోత్సాహం

విరసం సీనియర్ నాయకులు సిఎస్ ఆర్ ప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సనాతన ధర్మ పరిరక్షణ అంటే కుల వ్యవస్థను పరిరక్షించడమేనని విరసం సీనియర్ నాయకులు సిఎస్ ఆర్ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం బ్రాడీపేట లోని యుటిఎఫ్ హాలులో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాషువా పూలే పెరియార్ నటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సనాతన ధర్మం - రాజ్యాంగం అంశం పై సభ జరిగింది. ఈ సభకు కవి, జర్నలిస్ట్ బి.విల్సన్ అధ్యక్షత వహించారు. సిఎస్ ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ సనాతన వాదమంటే కూలిపోతున్న కుల వ్యవస్థను తిరిగి నిలబెట్టడమేనని స్పష్టం చేశారు. సనాతన ధర్మం ప్రకారం స్త్రీని అత్యంత తక్కువ స్థాయిలో ఉంచడమేనని తెలిపారు. నేడు సమాజంలో అన్ని రంగాల్లో మహిళలు దూసుకు పోతున్నారని తెలిపారు. ముస్లింల పై విద్వేష పూరిత ప్రచారం చేసి వారిని రెండో శ్రేణి పౌరులుగా చూడటానికేనన్నారు. ఇది పూర్తిగా



మాట్లాడుతున్న సిఎస్ఆర్ ప్రసాద్

రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. మతాలు మనుషుల్ని సంస్కరించాలే తప్ప ఒక మతం పై మరో మతం దాడులు చేయడం కాదని హితవు చెప్పారు. సనాతన ధర్మాన్ని ఇప్పుడు రాజకీయాలకు వాడుకుంటున్నారని విమర్శిం చారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో సనాతన ధర్మం పనికి రాదన్నారు. కులం అడ్డుగోడలను ధ్వంసం చేసి నూతన సమాజాన్ని నిర్మించాలని కోరారు. విద్యార్హతలను బట్టి వృత్తులు ఉండాలే తప్ప వంశ పారంపర్యంగా ఉండకూడదని స్పష్టం చేశారు. అయితే సనాతన ధర్మం పై విస్తృతంగా, తాత్వికంగా చర్చ జరగాలని కోరారు. కార్యక్రమంలో బహుజన్ పొలిటికల్ సెంటర్ నాయకులు సాధు మాల్యాద్రి, సీనియర్ న్యాయవాది వై.కె., విసికె పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కె.జయసుధ, సామాజిక కార్యకర్త కనకవల్లి వినయ్, కవి, నాటక ప్రయోక్త దేవరపల్లి ప్రభుదాస్, మాల మహానాడు నాయకులు బత్తుల అనిల్ బాబు, రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు ఈరి రాజశేఖర్, మేడద బాబురావు, బి.కె.రావు, బండారు దేవరాజు తదితరులు పాల్గొన్నారు.